# గురివింద గింజ

## కొంగే సుధాకర రావ్




ఆరోజు ఆఫీసుకు సెలవుకావడంతో బెడ్‌రూంలో ఒంటరిగా నడుం వాల్చా. నడుం వాల్చానన్నమాటేకాని మధ్యాహ్నం నిద్రపోయే పాడు అలవాటు నాకసలు లేదనే చెప్పాలి. పత్రిక పేజీలు తిరగేస్తున్నా. పక్కింటి ఆంటీ సుబ్బమ్మగారు మా ఆవిడ కోసం వచ్చినట్లుంది.

"ఏంటి మీనా! వంట అయిపోయిందా" ఆంటీ ప్రశ్న.

"ఇపుడే అయిందాంటీ! భోజనాలు కూడ పూర్తయ్యాయి. రండి! లోపలకూర్చుందాం" అంటూ మా ఆవిడ పైకి ఇష్టం లేకున్నా ఆమెను ఆహ్వానించింది.

"ఓ గిన్నెడు చక్కెర ఉంటే ఇస్తావూ! వచ్చే వారం ఇస్తా"

"ఓ అదేం మహా! ఇదిగో ఇపుడే తెస్తా" వంటింట్లోంచి చక్కెర తెచ్చి ఇచ్చింది మా శ్రీమతి మీనాక్షి. ఆమెకు పౌరసరఫరాల శాఖా మంత్రి పదవి వస్తే బావుణ్ణనిపించింది.

"ఇవాళ ఆఫీసుకు సెలవటగా" మొదలుపెట్టింది ఆంటీ.

"ఔనాంటీ! మావారు పడుకున్నారు"

"మన పొరుగింటి రాధమ్మ ఉంది చూశావా?"

"ఏమైంది ఆంటీ ఆవిడకి?"

"అబ్బే ఆవిడకేమౌతుంది. నిక్షేపంలా ఉంది. ఆవిడ కూతురే"

"ఏమైంది ఆవిడగారి అమ్మాయికి?"

"ఆవిడ తన కూతుర్ని కాస్త అదుపులో పెట్టదు! అవ్వ! ఏం చెప్పను! పెళ్ళీడుకు వచ్చిన పిల్ల. ఎపుడూ షికార్లు చేస్తూ ఉంటుంది."

"కాస్త వివరంగా చెప్పండి ఆంటీ" మా ఆవిడ ప్రశ్నించింది కుతూహలంగా. నాకు ఒళ్ళు మండుతోంది. ఈ ఆడవాళ్ళకు ఏదో చాడీలు చెప్పుకోకపోతే అసలు టైంపాస్ కాదేమో అనిపించింది నాకు.

"మొన్న ఎవరో కుర్రాడు వాళ్ళ ఇంటికి వచ్చాడు. కాలేజీలో ఫ్రెండట! అమ్మో! అమ్మో! అతను వచ్చీరాగానే రాధమ్మ కూతురు వాడితో కలిసి స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయింది."

"ఏమైనా పని పడిందేమో వెళ్ళుంటుంది."

"అర్జంటు పనా! పాడా! ఓ అమ్మాయి - అందునా పెళ్ళి కాని అమ్మాయి ఓ కుర్రాడితో కలిసి వెళ్ళడం నాకేమంత నచ్చలేదు."

"ప్రేమించుకుంటున్నారేమో వాళ్ళిద్దరూ" మా శ్రీమతి అంది సమర్థిస్తున్నట్లుగా.

"ప్రేమా - పాడా! కూతురికి బుద్ధి లేకపోతే పోయింది. వాళ్ళమ్మకైనా ఉండొద్దూ! వయసు వచ్చిన పిల్ల అలా ఏ కుర్రాడితోనో కులుకుతుంటే నలుగురూ ఏమనుకుంటారన్న కనీసపు విచక్షణా జ్ఞానం లేదు. ఛఛ! ఏం కలికాలమో!" విసుక్కుంది సుబ్బమ్మ ఆంటీ.

"ఎన్నిరోజుల్నుంచి సాగుతోంది ఈ వ్యవహారం"

"ప్రతిరోజూ నేను చూస్తూనే ఉన్నాగా".

"మరి వాళ్ళమ్మగారినే కనుక్కో కూడదూ?"

"ఛ! ఛ! దాన్నేం అడిగేది! దాని నోరు అసలే మంచిది కాదు."

"అయినా వాళ్ళ కూతురు కదండీ! ఆ బాధ్యత వాళ్ళకుండాలి గాని మనమేదైనా అంటే - నీకెందుకు అనేస్తే బిక్క మొగం వేయాల్సిందే" మా ఆవిడ మెల్లగా చెప్పింది.

"అయినా మనకెందుకులే! వచ్చేవారం చక్కెర తెచ్చిస్తా! వస్తా మీనా!" అంటూ సుబ్బమ్మ ఆంటీ వెళ్ళిపోయింది. నేను కాస్త హాయిగా ఊపిరి పీల్చుకున్నా, పత్రికను అవతల పెట్టేశా. రేడియో ఆన్ చేశా! ఏవో పాటలు మొదలయ్యాయి.

"మీనా! లోపలికి రావా"

"వస్తున్నానండీ. పాలు వేడి చేశా. తోడు చేసి వస్తా!" కాలి అందెలు ఘల్లుఘల్లుమంటుంటే మా శ్రీమతి గదిలోకి రానే వచ్చింది.

"తోడు వేశావా?" అడిగాను శ్రీమతిని దగ్గరకు తీసుకుంటూ.

"వేశానండీ!"

"నాకూ తోడు కావాలి"

"ఇదిగో వచ్చేశాగా మీ కోసం" అంది ముసిముసిగా నవ్వుతూ. ఆమె చేతిలోని తాంబూలాన్ని అందుకుంటూ ఆ వేలు కొరికి వేశా.

"అబ్బా! మీరిలా చేస్తే ఇంకోసారి ఆకు-వక్క ఇవ్వను" అంది బుంగమూతి పెడుతూ.

రేడియోలో పాట వస్తోంది "ఆకు వక్కలేకపోతే నోరు పండదు. గోరువంక లేకపోతే చిలక ఉండదు."

"పాట విన్నావుగా! చేసిన తప్పుకు సారీ! ఇక దరికి రావా" అంటూ రేడియో ఆఫ్ చేశా. నా గుండెలపై వేళ్ళు కదిలిస్తూ నవ్వుతూ పడుకుంది మీనా.

* * *

రెండు మూడు రోజులు గడిచిపోయాయి. రోజుకు మళ్ళీ లంచ్ కోసం మధ్యాహ్నం ఇల్లు చేరుకున్నా, కాళ్ళు చేతులు కడుక్కుని భోజనానికి కూర్చున్నా. మా శ్రీమతి మీనాక్షి కొసరి కొసరి వడ్డిస్తోంది. ఆవకాయలో శ్రీమతి నెయ్యి వేసింది. అన్నంలోకి ఆవకాయ కలుపుకుంటూ అడిగా.

"ఏంటి ఇవాళ విశేషాలు"

"పక్కింటి సుబ్బమ్మగారింటికి అల్లుడు వచ్చాడండి".

"ఎవరి అల్లుడు?"

"అదే సుబ్బమ్మగారి కూతురు రేఖకి కాబోయే మొగుడు."

"మొగుడింకా కాలేదన్నమాట".

"మొన్న సంక్రాంతి రోజున నిశ్చితార్థం చేశారట! వేసవిలో ముహూర్తం" వివరించింది శ్రీమతి.

నేను సాంబారు తినేసి పెరుగు తినడం ప్రారంభించా.

"అయినా ఒకటి అర్థం కావడం లేదండీ!"

"ఏమిటి?" చేతులు కడిగాక టవలుతో తుడుచుకుంటూ లేచి కుర్చీపై కూలబడ్డా.

"ఇంకా పెళ్ళి కావడానికి 2, 3 నెలలున్నాయి. అపుడే ఎంచక్కా రేఖ కాబోయే మొగుడితో రోజా సెకండ్‌షో సినిమాలకెళ్తోంది. షికార్లు కొడుతోంది" మెల్లగా గుసగుసలాడినట్లు అంది మా శ్రీమతి తిన్న కంచాన్ని తీసి శుభ్రం చేస్తూ.

"మొన్ననే శ్రీశైలం వెళ్ళి వచ్చారట" అంది కంచం స్టాండ్‌లో పెడుతూ.

"ఎవరు చెప్పారు నీకివన్నీ"

"ఆ పక్కింటి రాధమ్మగారు చెప్పారు అంటే రాధమ్మగారి కూతురు వీణ ఎవరితోనో స్కూటర్‌పై వెళ్ళడం అనే సుబ్బమ్మ చాడీకి ఇది ప్రతి చాడీ అన్నమాట! బావుంది వీళ్ళ వ్యవహారం"

"వాళ్ళ పెళ్ళి-వాళ్ళ మొగుళ్ళు... వాళ్ళ ఇష్టం. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎవరితోనైనా షికార్లు కొట్టే స్వేచ్ఛ ఉంది. దాన్ని ఎవరూ కాదనలేరు" అన్నా శ్రీమతిని కాస్త ఉడికిస్తూ, తమలపాకుకు సున్నం రాస్తూ శ్రీమతి అంది -

"అది కాదండీ! ఆవిడ రాధమ్మ కూతుర్ని నానా మాటలు అయితే అంది కాని ఇవాళ తన కూతురే కాబోయే భర్తతో స్వైరవిహారం చేస్తూంటే నోరు మెదపదేం" మా ఆవిడ గొంతులో 'ఇదేం న్యాయం' అన్న భావం ధ్వనించింది.

మౌనంగా శ్రీమతి అందించిన తాంబూలాన్ని అందుకుని నోట్లో పెట్టుకున్నా.

అంతలో 'మీనా! మీనా' అంటూ సుబ్బమ్మ ఆంటీ కేకవేయడం విన్పించింది.

"ఏం కావాలి ఆంటీ" మా శ్రీమతి అడిగింది.

"వందనోటుకు చిల్లర కావాలి. రెండు యాభైలున్నాయా!" మౌనంగా సుబ్బమ్మ నుండి మా ఆవిడ వందనోటు తీసి నా కిచ్చింది. నేను రెండు యాభైలు ఇచ్చేశా.

"ఊరికెళ్తున్నారా?" అడిగింది మీనాక్షి. నా చేతుల్లోని రెండు యాభైలు ఆంటీకి అందిస్తూ.

"లేదు మీనా! అల్లుడుగారు వచ్చేవారం ఢిల్లీ వెళుతున్నారు. టికెట్ రిజర్వేషన్ కోసం ఇపుడు బయలుదేరారు! ఏదేమైనా ఈ కాలం పిల్లలు కదా! మడి కట్టుకు కూచుంటే ఏం లాభం? సరదాగా వెళ్ళి వస్తే ఒకర్నొకరు అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని నేనే పంపిస్తున్నా మా రేఖని" చిన్న ఉపన్యాసం ఇచ్చి సుబ్బమ్మ ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆటోలో రేఖ, ఆమె ఉడ్‌బీ - ఇద్దరు వెళ్ళే చప్పుడు వినిపించింది.

బెడ్‌రూంలోకి వస్తూ మా శ్రీమతి అందుకుంది. "వేరే వాళ్ళకో న్యాయం. తనకో న్యాయమా".

"మీనా! వాళ్ళేమైనా చేసుకోనీ! అనవసరంగా నువ్వెందుకు బుర్రపాడు చేసుకుంటావ్!"

"ఆమెను చూస్తోంటే గురివిందగింజ జ్ఞాపకానికి వస్తోందండి" అంది మా శ్రీమతి నా పక్కన కూర్చుంటూ.

మా శ్రీమతి పరిశీలనాశక్తికి లోలోపల నవ్వుకున్నా, ఆఫీస్‌కు టైమయిందని గ్రహించాక బట్టలు మార్చుకుని బయలుదేరా.

❀

